వలంగైమాన్ మారియమ్మన్ ఆలయంలో
పాడెకావళ్ల సమర్పణ వేడుక


అందంగా అలంకరించిన పాడెపై భక్తుడు
ఓ భక్తుడిని పాడెపై మోసుకెళుతున్న కుటుంబ సభ్యులు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా నీడామంగళం వలంగైమాన్‌లోని మారియమ్మన్ ఆలయంలో పంగుణి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 'పాడె కావళ్ల సమర్పణ' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారిని భక్తులు శీతలదేవిగాను పిలుస్తారు. ఈ నెల 8న పూలగుచ్చాలు నాటే వేడుకలతో పంగుణి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 10న భక్తుల ప్రథమ కంకణధారణ, 17న ద్వితీయ కంకణధారణ జరిగాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారు వివిధ వాహనాలలో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ ఉత్సవాల్లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పాడె కావళ్ల వేడుకలు ఆదివారం ఉదయం జరిగాయి. తీవ్రమైన రోగాలతో బాధపడేవారు ఈ ఆలయంలోని అమ్మవారిని దర్శించి తమను విముక్తులను చేస్తే పంగుణి ఉత్సవాల్లో పాడెకావళ్ల సమర్పిస్తామని వేడుకుంటారు. ఆ మేరకు అమ్మవారి అనుగ్రహంతో రోగాల నుంచి స్వస్థత పొందిన భక్తులు తమ కుటుంబ సభ్యుల సమేతంగా ఆలయానికి విచ్చేసి, అక్కడ పూలతో అలంకరించిన పాడెలపై శవంలా పడుకున్నారు. ఆ తర్వాత డప్పు వాయిద్యాల నడుమ పాడెలపై శవంలా పడుకున్న వారిని నలుగురు కుటుంబ సభ్యులు భుజాలపై మోస్తూ ఆలయం ముందున్న వీధిలో ఊరేగించారు. ప్రతిపాడెపై శవంలా పడుకున్న వ్యక్తి బంధువు నిప్పుకణికెల మట్టిపాత్రను మోసుకుంటూ నడిచారు. ఆలయాన్ని మూడుసార్లు ప్రదక్షిణ చేసిన తర్వాత ఆలయ ప్రవేశ ద్వారం వద్ద పాడె కావళ్లను వరుసగా ఉంచారు. ఆలయ పూజారి పాడెలపై శవంలా పడుకున్న భక్తుల నుదుట విభూదిని పూయగానే వారంతా లేచి నిలబడ్డారు. ఆ తర్వాత వరుసగా ఆలయం లోపలకు వెళ్ళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పాడెకావళ్ల సమర్పణ వేడుకలను చూసి దేశవిదేశాల నుండి విచ్చేసిన భక్తులు భక్తి పారవశ్యంతో తన్మయం చెందారు. ఇక సాధారణ భక్తులు ఎప్పటివలెనే అమ్మవారికి పాలకావళ్లు, పావురపు కావళ్లు, ఇనుపచువ్వల కావళ్లు అంటూ వివిధ రకాల కావళ్లను సమర్పించారు. ఈ వేడుకలను తిలకించేందుకు ఆదివారం వేకువజామును వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు, పోలీసులు, గ్రామపెద్దలు తగు వసతులు కల్పించారు.


మక్కల్‌నీదిమయ్యం ప్రచార కమిటీ నిర్వాహకుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు కమల్

ఎన్నికల్లో పోటీ చేయకపోవడం వ్యూహం

- డీఎంకే కూటమికి మద్దతుగా ప్రచారం
- కమల హాసన్ ప్రకటన

అడయార్, మార్చి 24: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయకపోవడం త్యాగం కాదని వ్యూహమని మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, నటుడు కమల హాసన్ అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఆదివారం ఉదయం పార్టీ కార్యాలయంలో ఎన్నికల ప్రచార వ్యూహ కమిటీ సభ్యులు, పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తనకు ఊహ తెలిసినప్పటి నుంచి కులం అనే పదం శత్రువు. దేశంలో కులగణన చేపట్టాలని కోరుతున్నాం. ఒకటి లేదా రెండు మాత్రమే కాదు అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేసే శక్తి సామర్థ్యాలున్నాయి. రాష్ట్ర హక్కులను కేంద్రం హరించేస్తోందని అందుకే డీఎంకేతో పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. డీఎంకేను విమర్శించి, ప్రస్తుతం డీఎంకే కూటమికి మద్దతు ఇచ్చి, ఆ కూటమిలో చేరడం భావ్యమేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారని, ప్రస్తుతం కేంద్రంలోని మతతత్వ పార్టీ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే దేశ సంక్షేమమే ప్రధానం కనుక డీఎంకే కూటమిలో చేరాల్సి వచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవడం తాము చేసిన త్యాగం కాదని, పార్టీ భవిష్యత్తు బాగుండాలనే లక్ష్యంతో తాను రూపొందించుకున్న వ్యూహమని ఆయన పేర్కొన్నారు.

కమల్ ప్రచార షెడ్యూల్...

ఈ సమావేశం ముగిసిన తర్వాత కమల్ తన ప్రచార పర్యటన వివరాలను అధికారికంగా విడుదల చేశారు. ఈ మేరకు ఈనెల 29న ఈరోడ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఈనెల 30న సేలం, ఏప్రిల్ 2న తిరుచ్చి, 3న చిదంబరం, 6న శ్రీపెరుంబుదూరు, చెన్నైలో ప్రచారం చేస్తారు. ఈనెల, 7న మళ్లీ చెన్నైలో, 10న మదురై, 11న తూత్తుక్కుడి, 14న తిరుప్పూరు, 15న కోయంబత్తూరు, 16న పొల్లాచ్చి లోక్‌సభ నియోజకవర్గాల్లో కమల హాసన్ ప్రచారం చేయనున్నారు.



మళ్లీ ప్రచారానికి మోదీ

అమిత్‌షా సహా 18 మంది కేంద్ర మంత్రుల రాక

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే రాష్ట్రంలో ఐదుసార్లు పర్యటించిన ప్రధాని నరేంద్రమోదీ, మళ్లీ మూడు సార్లు పర్యటించి ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించేందుకు సిద్ధమవుతున్నారు. అదే సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా 18 మంది కేంద్రమంత్రులు కూడా రాష్ట్రంలో పర్యటించి ప్రచార సభల్లో ప్రసంగించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా బీజేపీ రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపి తమ పర్యటన తేదీలను ఖరారు చేయనున్నారు. ప్రధాని మోదీ ఇదివరకే కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు, సేలం, తిరుప్పూరు నగరాల్లో బీజేపీ తరఫున ఏర్పాటైన భారీ బహిరంగ సభలు, రోడ్‌షోలో పాల్గొని డీఎంకే, కాంగ్రెస్‌లపై ఇండియా కూటమి నేతలపై విమర్శనాస్త్రాలు సంధించారు. తన పర్యటనలో ప్రజలనుంచి లభించిన స్పందనను చూసి విస్తుపోయిన ప్రధాని మోదీ తన ఎక్స్‌పేజీలో తమిళ ప్రజల ఆశీస్సులతో ఈ సారి 400కు పైగా సీట్లు గెలుచుకుని మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితోనే మళ్లీ ఆయన మూడు సార్లు రాష్ట్రంలో పర్యటించనున్నారని బీజేపీ రాష్ట్ర శాఖ సీనియర్ నాయకులు తెలిపారు. ఈ సారి మోదీ ఇప్పటి దాకా పర్యటించని పలు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నారని, ఎన్డీయే బహిరంగ సభలలోనూ పాల్గొని ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. ఆ ప్రకారం వేలూరు, పెరంబలూరు, తిరువణ్ణామలై, తేని, రామనాథపురం, విరుదునగర్ నియోజకవర్గాలలో పర్యటించి బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచార సభలలో పాల్గొనున్నారు. ఇక అమిత్‌షాతోపాటు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, వీకే సింగ్, కిషన్‌రెడ్డి, స్మృతి ఇరానీ సహా 18 మంది మంత్రులు కూడా రాష్ట్రంలో ప్రచారం చేయనున్నారు. పలు నగరాలలో ఏర్పాటయే బహిరంగ సభలలోనూ, రోడ్‌షోలలోనూ వీరంతా పాల్గొంటారని రాష్ట్ర బీజేపీ నాయకులు పేర్కొన్నారు.


అమిత్‌షా

యోగి ఆదిత్యనాథ్ ప్రచారం...

ఇదిలా ఉండగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేయడానికి సిద్ధమవుతున్నారు. కోయంబత్తూరు, కన్నియాకుమారి, మదురై తదితర నగరాలలో ఆయన రోడ్‌షోలు, ప్రచార సభల్లో పాల్గొంటారని స్థానిక నాయకులు తెలిపారు. ఈసారి రాష్ట్రంలో 20 సీట్లకు పైగా గెలుచుకోవాలన్న లక్ష్యంతోనే ప్రచారం చేయనున్నారని వివరించారు.

మళ్లీ ఇటుకెత్తుకున్న ఉదయనిధి


విరుదునగర్ రోడ్‌షోలో ఇటుకను చేతపట్టుకుని ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రి పనులు జరగలేదంటూ ఓ ఇటుకతో ప్రచారం చేసిన మంత్రి ఉదయనిధి... పార్లమెంట్ ఎన్నికల సందర్భగా అదే ఇటుకను చేతపట్టుకున్నారు. విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని తిరుమంగలంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఓపెన్‌టాప్ వ్యాన్‌లో నిలిచి ఎయిమ్స్ అంటూ ఆంగ్లంలో రాసి ఉన్న ఇటుకను పైకెత్తి చూపుతో ఇదేమిటో తెలుసా? అని జనాన్ని ప్రశ్నించారు. వెంటనే ఆ ప్రాంతంలో గుమికూడిన ప్రజలంతా 'మదురై ఎయిమ్స్... ఎయిమ్స్' అంటూ బిగ్గరగా కేకలు పెట్టారు. 2019లో ప్రధాని మోదీ మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారని, ప్రస్తుతం ఎలాంటి నిర్మాణ పనులు జరగకుండా ఆ ఆసుపత్రి స్థలం బీడు భూమిని తలపించేలా ఉందన్నారు. మోదీ వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, నూతన విద్యావిధానం ద్వారా ఐదు, ఎనిమిదో తరగతి విద్యార్థులు కూడా పబ్లిక్ పరీక్షలు రాయాల్సిన దుస్థితి దాపురిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థులందరూ గెలుస్తారనే నమ్మకం తనకుందని చెప్పారు.



కోయంబత్తూరులో పాత్రికేయుల సంఘం సభలో పాల్గొన్న అన్నామలైని సత్కరిస్తున్న నిర్వాహకులు

నా ఓటమి కోసం డీఎంకేతో అన్నాడీఎంకే దోస్తీ!

- అన్నామలై విమర్శ

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు నియోజకవర్గంలో తనను ఎలాగైనా ఓడించాలని భావిస్తున్న అన్నాడీఎంకే నాయకులు పాలకపక్షం డీఎంకేతో ప్రయత్నాలు సాగించనున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. ఆదివారం కోయంబత్తూరులో పాత్రికేయుల సంఘం ఏర్పాటు చేసిన సభలో ఎంపీగా గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధికి అమలు చేయనున్న పథకాలు గురించి ఆయన వివరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికలకు ముందు తనను ఓడించేందుకు బద్ధశత్రువులుగా ఉన్న అన్నాడీఎంకే, డీఎంకేలు ఒక్కటవుతున్నాయన్నారు. ఎల్లప్పుడూ చల్లగా ఉండే కోయంబత్తూరులో సాధారణ స్థాయి కంటే రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడానికి రాష్ట్రాన్ని పాలించిన ఆ రెండు పార్టీలే ప్రధాన కారణమన్నారు. కోవై నగరంలో ద్విచక్రవాహనంలో వెళ్లలేని దుస్థితిలో రహదారులు ఉన్నాయన్నారు. అదే విధంగా నగరంలో ఎక్కడా మాస్కు ధరించకుండా వెళ్లలేమన్నారు. ఎన్నికల్లో ఎక్కువగా ధనాన్ని ఖర్చుపెట్టనని ఇటీవల తాను చేసిన ప్రకటనను అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి తప్పుగా అర్థం చేసుకున్నారని, ఓటర్లకు నగదు పంపిణీ చేయనని, తన గెలుపుకోసం పాటుపడే పార్టీ శ్రేణులకు మాత్రమే ఖర్చుపెడతానని చెప్పానని పేర్కొన్నారు. ఎడప్పాడి ఎల్లప్పుడూ సొంత డబ్బులు ఖర్చుపెట్టరని టీ తాగేందుకు కూడా ఇతరుల వద్ద డబ్బులు తీసుకునే వ్యక్తి అని విమర్శించారు. స్మార్ట్ సిటీల పేరుతో ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టిన అన్నాడీఎంకే నేతలకు తనను విమర్శించే హక్కు లేదన్నారు. 27న ఉదయం తాను నామినేషన్ దాఖలు చేస్తానని, ఆ తర్వాత మూడు రోజులపాటు కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తానన్నారు. తన నియోజకవర్గంలో ప్రచారానికి రాకపోయినా స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు తనకు మద్దతుగా ప్రచారం చేస్తారన్నారు. రానున్న 25 రోజులు పార్టీ శ్రేణులకు అత్యంత కీలకమైనవని, ఎన్నికల సమయంలో అన్నాడీఎంకే, డీఎంకే పార్టీలు అక్రమాలు, అరాచకాలకు పాల్పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. 2002లో రెండు ట్రంకు పెట్టెలతో తాను కోయంబత్తూరులో విద్యనభ్యసించేందుకు వచ్చానని, శ్రమకు తగ్గ గౌరవమిచ్చే నగరం ఇదేనని అన్నామలై చెప్పారు. కోయంబత్తూరులో పుట్టి పెరిగిన యువతినే తాను వివాహం చేసుకున్నానని, ఈ నగరాన్ని జన్మస్థలంగానే భావిస్తానని, ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అంతర్జాతీయ స్థాయిలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నామలైన శపథం చేశారు.

అడయార్, మార్చి 24: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు సోమవారం నుంచి నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. ఇందుకోసం అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలతో సిద్ధంగా ఉన్నారు. నామినేషన్ దాఖలకు గడువు ఈనెల 27వ తేదీతో ముగియనుంది. సోమవారం శుభముహూర్త దినంగా ఉండడంతో అన్నాడీఎంకే, డీఎంకే, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి సిద్ధమవుతున్నారు. వచ్చే మూడురోజుల్లో అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారని తెలియడంతో రిటర్నింగ్

నేటినుంచి ప్రధాన పార్టీ అభ్యర్థుల
నామినేషన్లు

- 27న ముగియనున్న నామినేషన్ల స్వీకరణ

అధికారుల కార్యాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేపట్టడంలో నిమగ్నమయ్యారు.

కూటమి పార్టీలివే...

అధికార డీఎంకే కూటమిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్, కొంగు దేశీయ మక్కల్ కట్చి వంటి పార్టీలు ఉన్నాయి. తమిళనాడు, పుదుచ్చేరిలలో కలిసి మొత్తం 40 సీట్లు ఉండగా, వీటిలో డీఎంకే 21 స్థానాల్లో మిగిలిన భాగస్వామ్య పార్టీలు 19 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. అదేవిధంగా అన్నాడీఎంకే సారథ్యంలో కూటమి, భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో మరో కూటమి ఈ ఎన్నికల్లో తలపడనున్నాయి.

27న ఆఖరు....

ఎన్నికల్లో నామినేషన్ దాఖలకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 27వ తేదీ వరకు గడువు ఇచ్చింది. మరో మూడు రోజులు మాత్రమే ఉండటంతో సోమవారం నుంచి అన్ని పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. నార్త్ చెన్నై లోక్‌సభ స్థానానికి బేసిన్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓల్డ్ వాషర్‌మెన్‌పేట కార్పొరేషన్ పాత డిప్యూటీ తహసీల్దారు కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే, సౌత్ చెన్నై లోక్‌సభ పరిధిలో అడయారులోని కార్పొరేషన్ దక్షిణ డివిజన్ జాయింట్ కమిషనర్ కార్యాలయం, సెంట్రల్ చెన్నై లోక్‌సభ పరిధిలోని స్థానిక షెనాయ్ నగర్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోను, మిగిలిన అభ్యర్థులు ఆయా జిల్లాల కార్యాలయాల్లో ఈ నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల వరకు మాత్రమే అభ్యర్థుల వాహనాలను అనుమతిస్తారు. అలాగే, నామినేషన్ సమయంలో అభ్యర్థి సహా ఐదుగురిని మాత్రమే నామినేషన్ దాఖలు చేసేందుకు కార్యాలయంలోకి అనుమతిస్తారు.

పోలింగ్ బూత్ సిబ్బందికి
తొలివిడత శిక్షణ ప్రారంభం


చెన్నైలోని ఓ పాఠశాలలో ఈవీఎంల పనితీరుపై పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న జోనల్ అధికారి

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని సౌత్ చెన్నై, నార్త్‌చెన్నై, సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల సిబ్బందికి తొలివిడత శిక్షణ ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఈ మూడు నియోజకవర్గాల్లో 3726 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో పనిచేయడానికి ఎంపికైన సిబ్బందికి నాలుగు విడతల్లో శిక్షణ ఇచ్చేందుకు ఎన్నికల నిర్వహణాధికారి, కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ రాధాకృష్ణన్ ఉత్తర్వు జారీ చేశారు. ఆ మేరకు నగరంలోని 16 శాసనసభ నియోజకవర్గాల్లో ఒకే సమయంలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆయా ఎన్నికల జోనల్ అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఉపయోగించే విధానంపై శిక్షణ ఇచ్చారు. నగరంలోని తండయార్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్, వ్యాసార్పాడి అంబేడ్కర్ ప్రభుత్వ కళాశాల, పెరంబూరు బందర్ గార్డెన్ సమీపంలోని కార్పొరేషన్ పాఠశాల, ఐసీఎఫ్ మహోన్నత పాఠశాల, చూలైలోని కార్పొరేషన్ బాలికల పాఠశాల సహా 16 ప్రాంతాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.



డీఎంకే మాయమాటలకు జనం మోసపోరు

- తిరుచ్చి సభలో ఈపీఎస్


తిరుచ్చిలో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన బహిరంగ సభలో పాల్గొన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా 39 నియోజకవర్గాల అభ్యర్థులు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అన్నాడీఎంకే పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, డీఎంకే అధికారంలోకి రాగానే అవినీతి పెరిగి అభివృద్ధి క్షీణించిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. తిరుచ్చిలో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన బహిరంగ సభలో కూటమి తరఫున పోటీ చేస్తున్న 40 మంది అభ్యర్థులను సభకు పరిచయం చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని చోట్లా గెలిచిన డీఎంకే కూటమి ఎంపీలు రాష్ట్రానికి చేసిందేమీలేదని, నీట్‌పై సీఎం స్టాలిన్ నోరెత్తడం లేదన్నారు. రాష్ట్రంలో ద్విముఖ పోటీయేనని, బీజేపీని పట్టించుకోరన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు వీలుకాని ఎన్నో హామీలను ప్రకటించి డీఎంకే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం ఆ పార్టీ ఇచ్చిన హామీలు కూడా ప్రజలను మోసగించే రీతిలోనే ఉన్నాయన్నారు. వైద్య కోర్సులకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 7.5 శాతం రిజర్వేషన్లు కల్పించింది తమ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. డీఎండీకే నాయకురాలు ప్రేమలత మాట్లాడుతూ... 2026 అసెంబ్లీ ఎన్నికల వరకు అన్నాడీఎంకేతో పొత్తు కొనసాగుతుందన్నారు. మూడేళ్ల డీఎంకే పాలనలో ప్రజలకు ఉపయోగపడే దీర్ఘకాలిక పథకాలేవీ అమలు చేయలేదని, ప్రభుత్వంపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. డీఎంకే మేనిఫెస్టోలో చెప్పినట్లు సిలిండర్, పెట్రోలు ధరలు తగ్గించడం సాధ్యం కాదని విద్యావంతులు, మేధావులే కాకుండా పామరజనం కూడా చెబుతున్నారని ఆమె తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

సమాచార దర్శిని

3నుంచి ఉన్నత విద్యపై అవగాహన

పెరంబూర్, మార్చి 24: ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం ప్లస్‌టూ పూర్తి చేసిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఉన్నత విద్య గురించిన మార్గదర్శకాలతో కూడిన తరగతులు ఏప్రిల్ 3వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. 15వ తేది వరకు జరగనున్న ఈ తరగతుల్లో ఉన్నత విద్యలో అందిస్తున్న కోర్సులు, వాటికి సంబంధించిన పాఠ్యాంశాలు, ఉన్నత విద్య అనంతరం ఉపాధి అవకాశాలపై విద్యారంగ నిపుణులు అవగాహన కల్పిస్తారు. ఈ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొనేలా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

నేటితో ముగియనున్న ప్లస్‌వన్ పబ్లిక్ పరీక్షలు

● మే 14న ఫలితాలు

పెరంబూర్, మార్చి 24: ప్రస్తుత విద్యా సంవత్సరం ప్లస్‌వన్ పబ్లిక్ పరీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. ఈ నెల 4వ తేది నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలకు సుమారు 8 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల జవాబు ప్రతాల మూల్యాంకనం ఏప్రిల్ 6 నుంచి 25వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 83 కేంద్రాల్లో జరగనుంది. మూల్యాంకన పనుల్లో సుమారు 46,000 మంది పీజీ టీచర్లు పాల్గొననున్నారు. మూల్యాంకం పూర్తయిన వెంటనే మార్కులు నమోదు పూర్తిచేసి మే 14వ తేది ఫలితాలు విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రైల్వేస్టేషన్లలో భారత్ బియ్యం, గోధుమపిండి విక్రయాలు

పెరంబూర్, మార్చి 24: కేంద్ర ప్రభుత్వం తక్కువ ధరకు విక్రయిస్తున్న భారత్ బియ్యం, గోధుమపిండి రైల్వేస్టేషన్లలో విక్రయించేందుకు దక్షిణ రైల్వే అనుమతించింది. భారత్ బియ్యం, గోధుమ పిండి, భారత్ కంది పప్పు తదితరాలను పలు రైల్వేస్టేషనన్లలో విక్రయించేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ విక్రయాలు దక్షిణ రైల్వే పరిధిలో కూడా చేపట్టాలని ఈనెల 15న రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకంలో కిలో బియ్యం రూ.29, కిలో గోధుమపిండి కిలో రూ.27.50కి విక్రయిస్తున్నారు. ఏయే రైల్వేస్టేషన్లలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే విషయం ఆయా రైల్వే జోన్ల సిఫారసు మేరకు చేపడతామని దక్షిణ రైల్వే తెలియజేసింది.

జూన్ 3నుంచి 'సెట్'

పెరంబూర్, మార్చి 24: మనోన్మనియం సుందరనార్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సెట్ జరగనుంది. దేశవ్యాప్తంగా సహాయ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ అనే జాతీయస్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. రాష్ట్రంలో ఉన్న సహాయ ప్రొఫెసర్ పోస్టుల్లో చేరేందుకు 'నెట్', రాష్ట్రప్రభుత్వం నిర్వహించే 'సెట్' పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ ఏడాది సెట్ పరీక్ష నిర్వహణకు మనోన్మనియం సుందరనార్ విశ్వవిద్యాలయానికి రాష్ట్రప్రభుత్వం అనుమతించింది. ఆ ప్రకారం, జూన్ 3 నుంచి 25వ తేది వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ https://www.msuniv.ac.in/లో ఏప్రిల్ 1 నుంచి 30వ తేదిలోపు పంపించాలని ప్రకటన వెలువడింది.

నేటినుంచి 'నీట్' శిక్షణ తరగతులు ప్రారంభం

పెరంబూర్, మార్చి 24: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'నీట్' శిక్షణ ఈనెల 25న సోమవారం నుంచి ప్రారంభం కానుంది. 'నీట్'కు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ అందిస్తోంది. అందు కోసం రాష్ట్రవ్యాప్తంగా 330 శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయగా, ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్‌టూ పరీక్షలు రాసిన 13,304 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొననున్నారు. నగరంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 850 మంది విద్యార్థులు పాల్గొనేలా 9 శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ప్రతిరోజు టెస్ట్‌తో పాటు మూడు మోడల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ ఏడాది నీట్‌కు రాష్ట్రం నుంచి 1,55,210 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, గత ఏడాదితో పోల్చితే 7,000 మంది విద్యార్థులు అధికంగా ఈ ఏడాది పరీక్షకు హాజరుకానున్నారు. గత ఏడాది నీట్ పరీక్ష రాసిన 12,997 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 3,982 మంది ఉత్తీర్ణత సాధించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు రూ.89 కోట్లు

పెరంబూర్, మార్చి 25: పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం రూ.89 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఒకేవిడతలో ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ ఎన్నికల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 68,144 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు తలా రూ.1,300ను కేటాయించారు. ఈ నిధులు వెంటనే గ్రామ నిర్వహణ అధికారులకు అప్పగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉదయనిధికి నటుడు సూరి విషెస్

అడయార్, మార్చి 24: రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం దక్షిణాది జిల్లాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధికి సినీ నటుడు సూరి అభినందనలు తెలిపారు. మదురై తెప్పకుళంలో జరిగిన ఒక శుభకార్యంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విని యోగించుకోవాలన్నారు. మనం వేసే ఓటు దేశాభివృద్ధి కోసం వేసే ఓటుగా ఉంటుందన్నారు. దక్షిణాది జిల్లాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధికి బెస్ట్ విషెస్ చెబుతున్నట్టు పేర్కొన్నారు.

ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేందుకే వచ్చా

తమిళిసై సౌందర్ రాజన్



సౌమ్య అన్బుమణిని శాలువతో సత్కరిస్తున్న తమిళిసై

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేందుకే మళ్లీ రాజకీయాల్లో ప్రవేశించి బీజేపీ తరఫున పోటీ చేస్తున్నానని పుదుచ్చేరి మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. నగరంలో ఆదివారం ఎన్డీయే కూటమిలోని మిత్రపక్షాల నాయకులతో ఆమె భేటీ అయ్యారు. పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ ఇంటికి మర్యాదపూర్వకంగా వెళ్లారు. అన్బుమణి సతీమణి సౌమ్యను తమిళిసై శాలువతో సత్కరించారు. తాను గవర్నర్ పదవిని చేపట్టడానికి ముందే రాష్ట్రంలో కమలం వికసిస్తుందని ప్రకటించానని, ఆ మేరకు బీజేపీ తరఫున నలుగురు శాసనసభ్యులు గెలిచారని అన్నారు. అదే రీతిలోనే సౌత్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో కమలం వికసించి తీరుతుందన్నారు.






పెరంబూర్ వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ సంఘంలో మట్టలతో సండే స్కూలు చిన్నారులు - వెప్పేరి మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘంలో ప్రత్యేక ప్రార్థనల్లో తెలుగు క్రైస్తవులు - అయనావరం రక్షణ సైన్యం సంఘం ఆధ్వర్యంలో మట్టల ఊరేగింపు - ఐసిఎఫ్ పునరుత్థారణ లూథరన్ దేవాలయంలో మట్టల ఊరేగింపులో మహిళలు

కోలాహలంగా మట్టల ఆదివారం

● రాష్ట్రవ్యాప్తంగా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, మార్చి 24: రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. మానవాళి శ్రేయస్సు కోసం శిలువపై మరణించి మూడో రోజు పునరుత్థానుడైన యేసుక్రీస్తును స్తుతిస్తూ మట్టలు చేతబట్టుకొని వీధుల్లో తిరిగారు. ప్రసిద్ధిచెందిన వేలాంకన్ని మేరీమాత బాసిలికా, తిరుత్తురైపూండి మేరీమాత చర్చి, స్థానిక బిసెంట్ నగర్ వేలాంకన్ని చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చి, ఎగ్మూర్‌లోని సేక్రెడ్ హార్ట్ బాసిలికా సహా చర్చి ఆఫ్ సౌత్ ఇండియా, ఈసీఐ, మారనాత చర్చీల్లో మట్టల ఆదివారం సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అశేష భక్త జనం మధ్య నాగపట్టినం జిల్లా వేలాంకన్నిలోని శిలువ మార్గం ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాల సందర్భంగా జరుపుకొనే మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు యేసుక్రీస్తు ఆలయ ప్రవేశ ఉత్సవంగా పాటించి, మట్టలతో స్వాగతించడం ఆనవాయితీ. దావీదు రాజు గాడిదపై జెరూసలేం పట్టణానికి వెళ్లిన సమయంలో ప్రజలు ఆయనను 'నీతికి రాజు... సమాధాన కర్త - మానవులకు రక్షకుడు' అని జయజయధ్వానాలు చేస్తూ ఖర్జూరం, మట్టలు పట్టుకొని నేలపై తివాచి పరచి ఘనంగా స్వాగతించినట్లు బైబిల్‌లో ఉన్న సారాంశాన్ని గుర్తుచేసుకుంటూ జరుపుకున్నారు. పెరంబూర్ కుక్స్ రోడ్డులో ఉన్న వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ ఆలయ సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ పాల్ ఈశ్వరప్ప నేతృత్వంలో సండేస్కూలు చిన్నారులు మట్టలతో సందడి చేశారు. సంఘ ఉపాధ్యక్షుడు బీఎస్ జీవన్‌రాజు, కార్యదర్శి జి.నాగేశ్వరరావు, కోశాధికారి ఎన్.పాల్ నాగేశ్వరరావు, సహాయ పాస్టర్లు, కమిటీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే, వెప్పేరి హైరోడ్డులోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘంలో సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మట్టల ఆదివారం ప్రత్యేక ప్రార్థనలకు సంఘ సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, కోశాధికారి ఎ.బాబు, రెవరెండ్ ఎంపీ ప్రసన్నకుమార్ పాల్గొన్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో రెవరెండ్ ఎం.ఆమోస్ దైవసందేశం అందించారు. అయనావరం రైల్వే కాలనీలోని రక్షణ సైన్యం సంఘం ఆధ్వర్యంలో కోర్ ఆఫీసర్లు మెరుపు విక్టర్ ఇమ్మానుయేలు, ఎంపీఆర్ నివేదిత అధ్యక్షతన మట్టల ఊరేగింపు ఆ కాలనీలోని అన్ని వీధుల గుండా సాగింది. కార్యదర్శి ఎస్.థామస్ సహా సంఘ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఐసిఎఫ్ జంక్షన్‌లోని పునరుత్థాన లూథరన్ దేవాలయం పాస్టర్ రెవరెండ్ ఇంటి రవిబాబు ప్రత్యేక ప్రార్థనలతో నిర్వహించిన మట్టల ఊరేగింపులో నిర్వాహకులు టీఎస్ ప్రకాశ్‌బాబు, కె.ప్రసన్నకుమార్, ఎం.ప్రసన్న, డీబీ జాన్సన్, ఆల్బర్ట్ రావు, విజయలక్ష్మి సత్యరాజ్, మాలతి, బి.ప్రేమ్‌కుమార్ సహా స్త్రీల సమాజం సభ్యులు, సండే స్కూలు, యూత్ ఉత్సాహంగా పాల్గొన్నారు. అంబత్తూర్ ఎస్టేట్ సమీపంలోని మన్నూరుపేట నెహ్రూనగర్ ఇమ్మానుయేలు క్రీస్తు సంఘం పాస్టర్ జాన్ సురేష్ అధ్యక్షతన జరిగిన మట్టల ఊరేగింపులో సంఘ పెద్దలు, ఎం.ప్రభుదాస్, వి.కొండలరావు, పి.ప్రభాకర్, వి.చంద్రరాజ్, ఆటో బెంజిమెన్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. విల్లివాక్కం భారతినగర్‌లోని యేసుక్రీస్తు కృపా నిరీక్షణ ప్రార్థనా ఫౌండేషన్ ఆలయంలో పాస్టర్ ఎం.మాణిక్యరావు అధ్యక్షతన జరిగిన ప్రార్థనలో నిర్వాహకులు ఊటుకూరి దేవదానం, శాంతకుమారి, వీడీ సామ్యేల్, ఎస్సార్ ఆరోగ్యం, వి.ముత్తయ్య తదితరులు పాల్గొని దేశ సంక్షేమం కోసం ప్రార్థించారు.

అరియానూరు ఆలయం కోసం 1400 కిలోల కంచు గంట తయారీ



గుడిగంటకు నగిషీ పనులు చేస్తున్న కళాకారులు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సేలం సమీపం అరియానూరు ప్రాంతంలోని అష్టోత్తర సహస్ర (1008) లింగాల శివాలయం కోసం నామక్కల్‌లో రూ.45లక్షలతో 1400 కిలోల బరువుతో కంచు గంట తయారవుతోంది. నామక్కల్‌లోని ముల్లైనగర్‌లో ఉన్న ఆండాల్ మెటల్ వర్క్స్ సంస్థకు చెందిన కళాకారులు ఆ గంటను తయారు చేస్తున్నారు. ఈ సంస్థ ఇది వరకే అయోధ్య రామాలయానికి 10 పెద్ద సైజు గంటలను, పూజలకు ఉపయోగించే 26 గంటలను అందించింది. ఈ నేపథ్యంలో అరియానూరు ఆలయం కోసం గంటను తయారు చేసే పనులను ఓ ప్రైవేటు విద్యా సంస్థ నిర్వాహకులు అప్పగించడంతో ఆండాళ్ మెటల్ వర్క్స్ నిర్వాహకులు రాజేంద్రన్, ఆర్ కాళిదాస్ సహా 25 మంది హస్త కళాకారులు 1400 కిలోలతో ఐదు అడుగుల ఎత్తు, 4.50 అడుగుల వ్యాసం కలిగిన గంటను తయారు చేశారు. ప్రస్తుతం నగిషీ పనులు చేస్తున్నారు.

చదురగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

పెరంబూర్, మార్చి 24: విరుదునగర్ జిల్లా చదురగిరి సుందర మహాలింగం ఆలయ పంగుణి నెల పౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అటవీ శాఖ నిబంధనల మేరకు, పశ్చిమ కొండల్లో కొలువై ఉన్న ఆలయానికి వెళ్లేందుకు భక్తులను ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతించారు. కొండ దారిలో వెళ్తున్న భక్తులు అగ్నిప్రమాదాలకు కారణమయ్యే వస్తువులు తీసుకెళ్లడానికి నిషేధించిన అధికారులు, వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే అనుమతించారు.

కండమనూరులో రూ.1.78 లక్షల స్వాధీనం



కండమనూరు వద్ద తనిఖీలు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపం కండమనూరు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రూ.1.78 లక్షల నగదు పట్టుబడింది. కండమనూరు రామచంద్రాపురం వద్ద అధికారులు జరిపిన తనిఖీల్లో నగదును స్వాధీనం చేసుకున్నారు.

పూందమల్లిలో...

అడయార్: నగర శివారు ప్రాంతమైన పూందమల్లిలో తగిన ఆధారాలు లేకుండా వ్యానులో తరలిస్తున్న రూ.96 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పూందమల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో శనివారం రాత్రి జరిపిన వాహనాల తనిఖీల్లో వ్యానులో తరలిస్తున్న రూ.95,93,900 నగదును స్వాధీనం చేసుకుని ఆర్డీవో కార్యాలయంలో అప్పగించారు.

మెట్రోరైలు మార్గం పనుల్లో జాప్యం

●ప్రైవేటు కాంట్రాక్ట్ సంస్థకు నోటీసు

ప్యారీస్, మార్చి 24: స్థానిక పూందమల్లి-పోరూర్‌ల మధ్య మెట్రోరైలు మార్గం ఏర్పాటుచేసే పనుల్లో నిర్లక్ష్యం చూపిన ఓ ప్రైవేటు కాంట్రాక్ట్ సంస్థ వద్ద వివరణ కోరుతూ చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) నోటీసు జారీచేసింది. నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారించే దిశగా తక్కువ సమయంలో గమ్యస్థానాలను చేరుకొనే విధంగా 2015వ సంవత్సరం మెట్రోరైలు పథకం అమల్లోకి వచ్చింది. ఈ రైళ్లకు ప్రజాదరణ పెరడంతో ప్రస్తుతం రూ.63,246 కోట్ల విలువతో 118.9 కి.మీ దూరానికి మూడు మార్గాల్లో రెండవ విడత పథకం పనులు జరుగుతున్నాయి. మైలాపూర్ లైట్ హౌస్ నుంచి పూందమల్లి బైపాస్ వరకు 26.1 కి.మీ దూరానికి, మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్ వరకు 45.8 కి.మీ దూరానికి, మాధవరం నుంచి షోలింగనల్లూర్ వరకు 47 కి.మీ దూరానికి ఏర్పాటుకానున్న రైలు మార్గంలో 9 అండర్ గ్రౌండ్ రైల్వేస్టేషన్లు, స్తంభాలపై 18 రైల్వేస్టేషన్లు నిర్మాణాలను ఇర్కాన్ అనే ప్రైవేటు కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. అయితే ఆ సంస్థ ఒప్పందం ప్రకారం పనులు నిర్వహించకుండా నిర్లక్ష్యం చూపుతోందంటూ అందిన ఫిర్యాదులపై సీఎంఆర్ఎల్ స్పందించి ఆ సంస్థకు నోటీసు జారీచేసింది.

రూ.10 నాణేలు నిరాకరించడం నేరం

పెరంబూర్, మార్చి 24: పది రూపాయల నాణేలు తీసుకొనేందుకు నిరాకరించడం నేరమని రాష్ట్రప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. అయినా, రాజధాని నగరం మినహా పలు జిల్లాల్లో ఈ నాణేలు తీసుకొనేందుకు వ్యాపారులు, బ్యాంకులు నిరాకరిస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయి. ఈ విషయమై పౌరసరఫరాలు, వినియోగదారుల భద్రతా శాఖ కమిషనర్ హర్‌సహాయ్ మీనా జిల్లా కలెక్టర్లకు పంపిన సర్క్యులర్‌లో... ప్రజల నుంచి పది రూపాయల నాణేలు తీసుకోవడంపై దుకాణాల యజమానులు, వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు ఈ విషయాన్ని ప్రజలు, వ్యాపారులు తెలుసుకొనేలా ప్రకటలను జారీ చేయాలని తెలిపారు.

దేవుడి విగ్రహంలో తెరుచుకున్న నేత్రాలు

● భక్తుల పరవశం



కళ్లు తెరిచిన స్థితిలో దేవుడి విగ్రహం

పెరంబూర్, మార్చి 24: దేవుడి విగ్రహంలోని కళ్లు తెరవడం గమనించిన భక్తులు పరవశించిపోయారు. ఈరోడ్ జిల్లా గాంధీపురం ప్రాంతంలో ఉన్న సంగిలి కరుప్పరాయన్‌ను స్థానికులు గ్రామ దేవుడిగా పూజిస్తుంటారు. శిథిలావస్థకు చేరిన ఈ ఆలయానికి జీర్ణోద్ధరణ పనులు చేపట్టిన గ్రామస్తులు, ఇటీవల కుంభాభిషేకం నిర్వహించారు. ఈ నేపథ్యంలో, శనివారం సాయంత్రం ఆలయానికి వచ్చిన భక్తులు విగ్రహం కళ్లు తెరచి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. ఈ విషయం దావానంలా వ్యాపించడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకొని కళ్లు తెరచిన స్వామివారిని చూసి పరవశించిపోతున్నారు.

డీఎంకే సభకు వెళ్తున్న వ్యాను బోల్తా

● క్షతగాత్రులను కాపాడిన అన్నాడీఎంకే ఎమ్మెల్యే



క్షతగాత్రులను రక్షిస్తున్న అన్నాడీఎంకే కార్యకర్తలు

పెరంబూర్, మార్చి 24: కళ్లకుర్చిలో ఆదివారం డీఎంకే లోక్‌సభ అభ్యర్థి పరిచయం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆ పార్టీ కార్యకర్తలు మినీ లగేజీ వాహనంలో బయల్దేరారు. వేగంగా వెళ్తున్న వాహనం హఠాత్తుగా అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో తమ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారంలోకి పాల్గొనేందుకు వెళుతున్న అన్నాడీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన వారిని తన కారులో ఆసుపత్రికి తరలించారు. అలాగే, 108 అంబులెన్స్‌ను రప్పించి స్వల్పంగా గాయపడిని వారిని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

జాలర్ల సమ్మె తాత్కాలికంగా వాయిదా

పెరంబూర్, మార్చి 24: శ్రీలంక జైళ్లలో ఉన్న 58 మంది జాలర్లు, పడవలను విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరం జాలర్లు శుక్రవారం నుంచి చేపల వేటకు వెళ్లకుండా చేపట్టనున్న సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ నెల 26వ తేది సముద్రంలో, ఏప్రిల్ 8వ తేది ఆధార్, రేషన్‌కార్డులు రామేశ్వరం తహసీల్దార్‌కు అప్పగించడం, లోక్‌సభ ఎన్నికలు బహిష్కరించడం తదితరాలను చేపట్టనున్నట్టు జాలర్ల సంఘాల సమాఖ్య ప్రకటించింది. ఈ నేపథ్యంలో, జాలర్ల సంఘాల ప్రతినిధులతో రామేశ్వరం హార్బర్‌లోని అనుమతి చీటీలు అందించే కార్యాలయంలో రామనాథపురం మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి నేతృత్వంలో అధికారులు చర్చించారు. సమస్యను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారుల హామీతో సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలిపిన జాలర్లు, ఏప్రిల్ 8వ తేదిలోపు సమస్య పరిష్కారం కాకుండా సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 8,565 దుకాణాల సీజ్

పెరంబూర్, మార్చి 24: నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 8,565 దుకాణాలు సీజ్ చేయడంతో పాటు, రూ.8.04 కోట్ల జరిమానా వసూలు చేశారు. రాష్ట్రంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులను పాఠశాలలు, కళాశాలల సమీపంలో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయి. ఈ విక్రయాలు అడ్డుకొనేలా రాష్ట్ర పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు, గత ఏడాది నవంబరు నుంచి దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ అధికారులు మాట్లాడుతూ... ఎన్నికల విధులు ఉన్నా, పోలీసు శాఖ సహాయంతో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు అడ్డుకొనేలా చర్యలు చేపట్టామన్నారు. గత పది రోజుల్లో 12,845 దుకాణాల్లో తనిఖీలు చేపట్టి రూ.1.04 కోట్ల విలువైన పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ వ్యవహారంలో 929 దుకాణాలను సీజ్ చేశామన్నారు. అలాగే నవంబరు నుంచి ఇప్పటివరకు రూ.8.04 కోట్ల విలువైన పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకొని, 8,565 దుకాణాలను సీజ్ చేశామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న పొగాకు ఉత్పత్తులను న్యాయస్థానం ఉత్తర్వులతో దహనం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల డిజిటలైజేషన్‌కు రూ.19.03 కోట్లు

పెరంబూర్, మార్చి 24: ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలను డిజిటలైజేషన్ చేసేందుకు రూ.19.03 కోట్లు కేటాయించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాలను డిజిటలైజేషన్ చేయనున్నట్లు 2022లో రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. తొలివిడతగా 2023లో రూ.10.96 కోట్లు కేటాయించింది. అనంతరం ఐటీ శాఖ అధికారుల సిఫారసుల మేరకు, అన్ని శాఖల కార్యాలయాలు, శాఖా కార్యాలయాలను డిజిటలైజేషన్‌కు రూ.19.03 కోట్లు కేటాయించడంతో పాటు నిర్వహణ అనుమతులిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కమల్‌తో తిరుమా భేటీ

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎంఎన్ఎం అధినేత కమల్‌తో డీపీఐ , సీపీఐ నేతలు భేటీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్నం డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, ఆ పార్టీ అభ్యర్థి రవికుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ తదితరులు కమల్ ఇంటికి వెళ్లారు. ఎన్నికల ప్రచార వ్యూహాలపై చర్చించారు. తమ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయాలని కమల్‌ను కోరారు.

డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే పోటీ : కనిమొళి

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే పోటీ అని, బీజేపీ కూటమిని ప్రజలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఎంపీ కనిమొళి తెలిపారు. చెన్నై విమానాశ్రయం వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రధాని ఎన్నిసార్లు పర్యటించినా బీజేపీకి ఓట్లు రాలే అవకాశం లేదని చెప్పారు. ఈ ఎన్నికల్లో కనీసం పది లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నట్లు ఆమె తెలిపారు. తాను పోటీ చేస్తున్న తూత్తుకుడిలోనే కాకుండా పుదుచ్చేరి 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులే గెలుస్తారని, బీజేపీ కూటమి అభ్యర్థులు ఎన్నికల తర్వాత పత్తా లేకుండా పోతారని కనిమొళి అన్నారు.

గాయని చిత్రకు 'జేపియర్ ఐకాన్ అవార్డు'



ఐకాన్ అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

అడయార్, మార్చి 24: నగరంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన జేపియర్ విద్యా సంస్థ యేటా ప్రదానం చేసే 'జేపియర్ ఐకాన్ అవార్డు 2024'ను ఈ యేడాది ప్రముఖ గాయని కేఎస్ చిత్ర, మ్యూజిషియన్ లిడియన్ నాదస్వరంతో పాటు మరికొందరికి ప్రదానం చేశారు. దేశాభివృద్ధిలో తమదైన పాత్రను పోషిస్తున్న అన్ని వర్గాల వ్యాపారవేత్తలు, ఇతర రంగాల వారి అంకితభావాన్ని గుర్తించి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. తాజాగా జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో జేపియర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ జేపియర్, జేపియర్ యూనివర్శిటీ ఫౌండర్, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రెజీనా కె.మురళి, జేపియర్ యూనివర్శిటీ ప్రెసిడెంట్ మురళి సుబ్రమణియన్, వైస్ ప్రెసిడెంట్ మార్గరెట్ ఆర్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో గాయని చిత్రతో పాటు ఆర్ఆర్ సేలం బిరియాని ఫౌండర్ తమిళ్‌సెల్వన్, టీఎన్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాస్ రాజ్, శంకర్ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ వైష్ణవి శంకర్, బ్లూమ్ ఫెర్టిలిటీ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కవిత గౌతమ్, డెర్బీ జీన్స్ ఫౌండర్ విజయ్ కపూర్, టాంకర్ ఫౌండేషన్ నిర్వాహకురాలు రాజలక్ష్మి రవి తదితరులు ఉన్నారు.

ఘనంగా పంగుణి ఉత్తిరం వేడుకలు

● క్షీరకలశాలతో పోటెత్తిన భక్తులు



ట్రిప్లికేన్‌లో క్షీరకలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళా భక్తులు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వడపళని, ట్రిప్లికేన్, తిరుప్పోరూరు, తిరుప్పరంకుండ్రం తదితర క్షేత్రాల్లోని మురుగన్ ఆలయాల్లో ఆదివారం పంగుణి ఉత్తిరం వేడుకలు వైభవంగా జరిగాయి. వడపళని మురుగన్ ఆలయంలో యాగశాల పూజలు జరిపారు. ఈ సందర్భంగా విరుగంబాక్కం, సాలిగ్రామం తదితర ప్రాంతాలకు చెందిన ఆలయాల నుంచి మహిళలు శిరస్సుపై క్షీర కలశాలతో ఊరేగింపుగా వడపళని ఆలయానికి చేరుకుని స్వామివారికి సమర్పించారు. ఈనెల 25న సోమవారం రాత్రి నుంచి మూడు రోజులపాటు తీర్థకొలనులో స్వామివారి తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఇక ట్రిప్లికేన్‌లో ఎట్టామ్‌పడైవీడు మురుగన్ ఆలయంలోనూ మహిళలు తీసుకొచ్చిన క్షీరకలశాలను సమర్పించారు. ప్యారీస్ కార్నర్‌లోని కందకొట్టమ్ ఆలయంలో, కుండ్రత్తూరు ఆలయంలో తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు వివిధ రకాల కావళ్లను సమర్పించారు.

సెంట్రల్‌లో గంజాయి స్వాధీనం

●ఇద్దరు పశ్చిమ బెంగాల్ మహిళల అరెస్ట్

పెరంబూర్, మార్చి 24: స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో 14 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు శనివారం రాత్రి మంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చింది. అన్‌రిజర్వుడు బోగీలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు మహిళలను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన డోలికాడున్, పూజా కుమారి దాస్ అని తెలుసుకున్నారు. వారి లగేజీని తనిఖీ చేయగా 14 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పూక్కడై పోలీసులు అరెస్ట్ చేశారు.

కేరళనుంచి వ్యర్థాలతో వచ్చిన వాహనం

● అడ్డుకున్న రాష్ట్ర సరిహద్దువాసులు

పెరంబూర్, మార్చి 24: కేరళ రాష్ట్రం నుంచి వైద్య, ప్లాస్టిక్ వ్యర్థాలతో వచ్చిన వాహనాన్ని రాష్ట్ర సరిహద్దుల్లో ప్రజలు అడ్డుకున్నారు. కేరళ నుంచి వ్యర్థాల వాహనం వస్తుందనే సమాచారంతో సరిహద్దు ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. చెక్‌పోస్ట్ అధికారులు ఆ వాహనాన్ని అడ్డుకోకుండా రాష్ట్రంలోకి వదిలిపెట్టారు. గమనించిన ప్రజలు వాహనాన్ని వెంబడించి, చుట్టుముట్టిరు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న చెక్‌పోస్ట్ సిబ్బంది, పోలీసులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులను ఎక్కించుకోకుండా వెళ్లిన బస్సు

● డ్రైవర్, కండక్టర్ సస్పెన్షన్

పెరంబూర్, మార్చి 24: విద్యార్థులను ఎక్కించుకోకుండా వెళ్లిన ప్రభుత్వ బస్సు డ్రైవర్, కండక్టర్లను అధికారులు సస్పెండ్ చేశారు. కళ్లకుర్చి జిల్లా తాళకుడిలోని బస్టాండులో కొద్దిరోజుల క్రితం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు వేచి ఉండగా, ఆ సమయంలో వచ్చిన ప్రభుత్వ బస్సును డ్రైవర్ ఆపకుండా వెళ్లారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో రవాణా శాఖ అధికారులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఫిర్యాదు వాస్తవమని తేలడంతో బస్సు డ్రైవర్, కండక్టర్లను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మోదీ ఓటమికే ఇండియా కూటమి

● డీపీఐ ఎంపీ తిరుమావళవన్



తెలంగాణ డీపీఐ అభ్యర్థులను పరిచయం చేస్తున్న తిరుమావళవన్

ప్యారీస్, మార్చి 24: నిరంకుశ పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీని ఓడించేందుకే కాంగ్రెస్, డీఎంకే, డీపీఐ తదితర పార్టీలతో ఇండియా కూటమి ఏర్పాటైందని దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా (డీపీఐ) ఎంపీ తిరుమావళవన్ పేర్కొన్నారు. వడపళనిలోని డీపీఐ ప్రధాన కార్యాలయంలో ఆదివారం 2024 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో డీపీఐ తరఫున పోటీ చేయనున్న 10 మంది అభ్యర్థులను తిరుమా మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మతం పేరుతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం విద్వేషాలు రెచ్చగొట్టి, ప్రజల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. ఒక మతాన్ని ఆదరించడం, మరో మతాన్ని అణిచివేయడానికి బీజేపీ పెద్దలు ఎన్నడూ లేని విధంగా కమలానికి గుర్తింపు లేని దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటించి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాల్లో దిగారని విమర్శించారు. దేశ సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతున్న బీజేపీ వల్ల తొమ్మిదేళ్లుగా దేశంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదన్నారు. ఎలక్టోరల్ బాండ్ల మోసంతో బీజేపీ మిగతా పార్టీల కంటే బాగా లాభపడిందన్న విషయం ప్రజలు గుర్తించారని, ప్రజల మద్దతుతో మోదీని ఓడించాలన్న లక్ష్యంతో ఉన్న ఇండియా కూటమిని ఈ సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రలో కూడా పోటీ చేయనుందని చెప్పారు. ఈ నెల 12న ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలతో పొత్తు కుదుర్చుకోవడంపై సంప్రదించి తమ పార్టీకి 17 అసెంబ్లీ స్థానాలు, నాలుగు ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరామని, బహుశా సోమవారం తమకు అనుకూలంగా నిర్ణయం వస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పోటీ చేయనున్న సికింద్రాబాద్‌లో తమ పార్టీ తరఫున పగిడిపల్లి శ్యాంసన్, నాగర్‌కర్నూల్, చేవేళ్ల, మల్కాజ్‌గిరి, వరంగల్, భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్, మెదక్, మహబూబ్‌నగర్‌లలో కూడా అభ్యర్థులను బరిలో నిలిపినట్లు తిరుమావళవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డీపీఐ అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే విద్యాసాగర్ సహా పలు రాష్ట్రాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.





పూలమ్మిన చోటే కట్టెలమ్ముకుంటున్న వైనం!

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి అన్నాడీఎంకే అధినేత్రి జయలలితకు అత్యంత విశ్వాసపాత్రుడు, మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, పార్టీ సమన్వయకర్తగా ఉన్నతస్థితికి రాకెట్ వేగంతో ఎదిగిన ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) పరిస్థితి పూలమ్మిన చోటే కట్టెలమ్ముకున్న చందంగా దయనీయంగా మారింది. బీజేపీ కూటమిలో చేరితే తనకు తన అనుచరులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశపడి చివరకు బోల్తాపడ్డారు. రామనాథపురం నియోజకవర్గంలో ఇండిపెండెంట్ గుర్తుపై పోటీకి దిగుతున్నారు. తేని జిల్లా పెరియకుళానికి చెందిన ఓపీఎస్ (73) తొలుత టీకొట్టు నడుపుతుండేవారు. డీఎంకే నుంచి ఎంజీఆర్‌ను బహిష్కరించిన తర్వాత అన్నాడీఎంకేలో సాధారణ కార్యకర్తగా చేరి తన రాజకీయ పయనం ప్రారంభించారు. 1993లో పెరియకుళం మునిసిపాలిటీ ఛైర్మన్‌గా గెలిచారు. పెరియకుళం లోక్‌సభ నియోజకవర్గంలో టీటీవీ దినకరన్ పోటీ చేసినప్పుడు ఆయనతో పరిచయం ఏర్పరచుకున్నారు. బోడినాయకనూరులో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. జయలలిత కోర్టు ఉత్తర్వుల వల్ల పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చినప్పుడు 2001లో ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. అక్రమార్జన కేసులో 2014లో జయలలితకు శిక్ష పడినప్పుడు, 2016లో ఆమె మృతి చెందినప్పుడు ఓపీఎస్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో ఆర్థిక, ప్రజాపనుల శాఖ రెవెన్యూ శాఖ అంటూ కీలకమైన శాఖలకు మంత్రిగా పనిచేశారు. జయ మృతి చెందిన తర్వాత పదిమంది శాసనసభ్యులను వెంటబెట్టుకుని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)తో ధర్మయుద్ధం జరిపిన కొద్ది నెలలకే తన వర్గాన్ని ఈపీఎస్ వర్గంలో కలిపి డిప్యూటీ ముఖ్యమంత్రి, పార్టీ సమన్వయకర్త పదువులు పొంది ఉన్నతస్థికి చేరారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారాన్ని కోల్పోయింది. అప్పటి నుంచి ఓపీఎస్ పతనం ఆరంభమైంది. పార్టీలో పట్టుకోసం పావులు కదిపి అభాసుపాలయ్యారు. పార్టీలో తనకు బలం లేదనే విషయం తెలిసి కూడా పార్టీపై పెత్తనం చెలాయించాలనుకున్నారు. చివరకు మెజారిటీ సభ్యులంతా ద్వంద్వ నాయకత్వానికి వ్యతిరేకించారు. ఓపీఎస్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. ఈ పరిస్థితులలో ఇద్దరు శాసనసభ్యులతో అన్నాడీఎంకేకు దీటుగా మరో పార్టీని నడిపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పార్టీ గుర్తును స్తంభింపజేసి ఈపీఎస్ వర్గీయులను ముప్పుతిప్పలు పెట్టాలనుకున్న ఓపీఎస్ వ్యూహం కూడా బెడిసి కొట్టింది. సెషన్స్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా చేసిన ప్రయత్నంలో సానుకూలమైన తీర్పు పొందలేకపోయారు. ఇక ఎటుపోవాలో తెలియని స్థితిలో అప్పటి దాకా బద్ధశత్రువులుగా భావించిన దినకరన్, శశికళతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారు. కానీ రాజకీయంగా పూర్వపుస్థితిని చేరుకోలేకపోయారు. ప్రధాని నరేంద్రమోదీతో తనకున్న పలుకుబడిని ఉపయోగించి బీజేపీ కూటమిలో చేరారు. టీఎంసీకి లభించినట్లు రెండు మూడు లోక్‌సభ స్థానాలు లభిస్తాయని ఆశపెట్టుకున్నారు. చివరకు బీజేపీ కూటమిలో దినకరన్‌కు లభించిన పరపతి, పలుకుబడి తనకు లేదని తెలిసి కుంగిపోయారు. ఆ కూటమి నుంచి బయటపడలేక, తన బాధను ఎవరికీ చెప్పుకోలేక కుమిలిపోయారు. ఈ పరిస్థితుల్లో రామనాథపురం నియోజకవర్గంలో ఇండిపెండెంట్ చిహ్నంతో పోటీకి సిద్ధమవుతున్నారు.

విలవంగోడులో ఇద్దరూ ఇద్దరే!

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా విలవంగోడు శాసనసభ నియోజకవర్గానికి తొలిసారిగా జరగనున్న ఉపఎన్నికలో ఇద్దరు మహిళలు పోటీకి దిగుతున్నారు. వీరిలో ఒకరు అన్నాడీఎంకే అభ్యర్థి రాణి కాగా మరొకరు బీజేపీ అభ్యర్థి నందిని. గత ఎన్నికల్లో కూటమి పొత్తుల్లో భాగంగా బీజేపీ తరపున జయశీలన్ పోటీ చేశారు. ప్రస్తుతం బీజేపీకి అన్నాడీఎంకే కటీఫ్ చెప్పిన విషయం విదితమే. ఈక్రమంలో బీపీఏ పట్టభద్రురాలైన నందినిని అన్నాడీఎంకే తన అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఈ నియోజకవర్గంలో విజయతరణి కాంగ్రెస్ తరపున మూడుసార్లు విజయం సాధించారు. ఇటీవల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఆమె బీజేపీలో చేరడంతో ఈ నియోజకవర్గానికి మొట్టమొదటిసారిగా ఉపఎన్నిక జరుగుతోంది. ఈ నియోజకవర్గం కన్నియాకుమారి - కేరళ రాష్ట్ర సరిహద్దులకు చేరువగా ఉంటోంది. ఈ పరిస్థితులలో సామాజిక సేవకులుగా పేరుగడించిన అన్నాడీఎంకే, బీజేపీ అభ్యర్థులిరువురూ నియోజకవర్గం ప్రజలకు సుపరిచితులు. నియోజకవర్గమంతటా సుడిగాలి ప్రచారం చేస్తూ ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపునా తమదేనంటూ ఇద్దరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. డీఎంకే కూటమిలో విలవంగోడు నియోజకవర్గాన్ని కాంగ్రెస్ కేటాయించారు. ఆ పార్టీ ఇంకా అభ్యర్థిని ఎంపిక చేయలేదు. ఈ ఇద్దరు మహిళలకు దీటుగా కాంగ్రెస్ మరో మహిళను బరిలోకి దింపుతుందో లేదో వేచి చూడాల్సిందే!


బీజేపీ అభ్యర్థి నందిని, అన్నాడీఎంకే అభ్యర్థి రాణి

నీలగిరిలో త్రిముఖ పోటీ

ప్యారీస్, మార్చి 24: దేశానికి స్వాతంత్రం వచ్చిన అనంతరం 1952లో తొలి లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీలు అధికంగా నివసిస్తున్న నీలగిరి పార్లమెంటు స్థానం ఆవిర్భవించింది. ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన రాష్ట్ర ఓటర్ల జాబితా ప్రకారం నీలగిరిలో మొత్తం 12,41,437 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 6,15,957, మహిళలు 6,25,200 మంది కాగా, ఇతరులు 253 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో భవానీసాగర్ (రిజర్వుడు), ఊటీ, గూడలూరు (రిజర్వుడు), కూనూరు, మేట్టుపాళయం, అవినాశి (రిజర్వుడు) అనే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు, ముస్లింలు, జైనులు, సిక్కులతో పాటు ఎస్సీ, ఎస్టీలు నివసిస్తున్నారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాల్లో ఇది 19వ ఎస్సీ నియోజకవర్గంగా గుర్తింపు పొందింది.


ఎ.రాజా (డీఎంకే)

2014లో... : ఈ సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, డీఎంకేల మధ్యే గట్టి పోటీ నెలకొంది. అన్నాడీఎంకే అభ్యర్థి గోపాలకృష్ణన్ 4,63,700 ఓట్లతో ఎంపీ గెలువగా, ఆయనతో పోటీపడిన డీఎంకే అభ్యర్థి ఎ.రాజా 1,04,940 ఓట్లతో ద్వితీయస్థానం దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో పోటీచేసిన సుమారు 12 మందికి పైగా ఇండిపెండెంట్ల డిపాజిట్ గల్లంతైంది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం భవానీసాగర్- ఈరోడ్ జిల్లా, మేట్టుపాళయం- కోవై, అవినాశి- తిరుప్పూర్ జిల్లాల్లో ఉంటూ నీలగిరి లోక్‌సభ పరిధిలో చేర్చడం గమనార్హం.

2019లో... : ఈ సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి ఎ.రాజా 5,47,832 ఓట్లు పొంది ఎంపీగా విజయం సాధించారు. ఆయనతో పోటీపడిన అన్నాడీఎంకే అభ్యర్థి త్యాగరాజన్ 3,42,009 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు.


ఎల్.మురుగన్ (బీజేపీ)

త్రిముఖ పోటీ... : నీలగిరి లోక్‌సభ నియోజకవర్గంలో సహజంగా డీఎంకే - అన్నాడీఎంకే పార్టీలే పోటీ పడుతుంటాయి. 2004లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే కూటమి నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రభు గెలుపొందారు. ఆయనతో తలపడిన బీజేపీ అభ్యర్థి మాస్టర్ మదన్ ఓటమి చవిచూశారు. 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొట్టమొదటి సారిగా డీఎంకే తరపున పోటీ చేసిన ఎ.రాజా గెలుపొందారు. అన్నాడీఎంకే కూటమి తరపున పోటీచేసిన ఎండీఎంకే అభ్యర్థి కృష్ణన్ ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో సిట్టింగ్ డీఎంకే ఎంపీ ఎ.రాజా, అన్నాడీఎంకే తరపున మాజీ స్పీకర్ ధనపాల్ కుమారుడు లోకేష్ తమిళ్‌సెల్వన్, బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ బరిలో ఉన్నారు.ఈ ముగ్గురు గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.


లోకేష్ తమిళ్‌సెల్వన్ (అన్నాడీఎంకే)

ఎట్టకేలకు ఏడుగురితో కాంగ్రెస్ జాబితా

● మాజీ ఐఏఎస్‌కు అవకాశం


కార్తీ చిదంబరం, విజయవసంత్, జ్యోతిమణి - శశికాంత్ సెంథిల్ - కే గోపీనాథ్

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలోని ప్రధాన మిత్రపక్షం కాంగ్రెస్ ఎట్టకేలకు శనివారం రాత్రి ఏడుగురితో తొలి విడత అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా పది లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పోటీ చేయనుంది. ఈసారి సిట్టింగ్ ఎంపీలు కార్తీ చిదంబరం, విజయవసంత్, జ్యోతిమణికి మళ్లీ పార్టీ టికెట్లు లభించాయి. ఇదే విధంగా విరుదునగర్ సిట్టింగ్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ కూడా మళ్లీ అక్కడే పోటీ చేయనున్నారు. ఈ జాబితాలో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ మాజీ అధ్యక్షుడు, తెలుగు ప్రముఖుడైన కె.గోపీనాథ్‌కు సీటు లభించడం విశేషం. తెలుగు ఓటర్లు అధికంగా ఉన్న కృష్ణగిరి నియోజకవర్గంలో ఆయన పోటీ చేయనున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం విడుదల చేసిన జాబితా ప్రకారం తిరువళ్లూరు రిజర్వుడు నియోజకవర్గంలో మాజీ ఐఏఎస్ అధికారి శశికాంత్ సెంథిల్, కృష్ణగిరిలో కె.గోపీనాథ్, కరూరులో జ్యోతిమణి, కడలూరులో విష్ణు ప్రసాద్, శివగంగలో కార్తీ చిదంబరం, విరుదునగర్‌లో మాణిక్కం ఠాకూర్, కన్నియాకుమారిలో విజయవసంత్ పోటీ చేయనున్నారు. ఇక తిరునల్వేలి, మైలాడుదురై, పుదుచ్చేరి నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

మాజీ ఐఏఎస్‌కు సీటు...

తిరువల్లూరు రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి శశికాంత్ సెంథిల్ పోటీ చేయనున్నారు. శశికాంత్ సెంథిల్ కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారిగా ఆ రాష్ట్రంలోని చిత్రదుర్గ, రాయచూర్ జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. 2019 సెప్టెంబర్‌లో తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా సమన్వయకర్తగా పనిచేశారు. కర్ణాటక శాసనసభ ఎన్నికల సమయంలో మాజీ ఐపీఎస్ అధికారి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆ పార్టీ గెలుపుకోసం పాటుపడినప్పుడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు అధిష్ఠానం శశికాంత్ సెంథిల్‌ను రంగంలోకి దింపింది. శశికాంత్ సెంథిల్ శ్రమకు తగిన ఫలితమే దక్కింది. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అంతే కాకుండా కర్ణాటకలో హిజాబ్ నిషేధం, అవినీతి అక్రమాలు, ముస్లింలకు నాలుగు శాతం అంతర్గత రిజర్వేషన్ల రద్దు పలు కీలకమైన అంశాలపై సామాజిక మాధ్యమాల్లో తన స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేసి నెటిజన్లను ఆకట్టుకున్నారు. ఫలితంగా కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ వార్‌రూం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శశికాంత్ సేవలను గుర్తించిన కాంగ్రెస్... ఆయన్ను టీఎన్‌సీసీ అధ్యక్షుడిగాను నియమించేందుకు కూడా సిద్ధమైంది. ఆఖరి క్షణంలో ఆ అవకాశం సెల్వపెరుందగైని వరించింది. ఈ పరిస్థితుల్లో శశికాంత్ సెంథిల్‌ను తిరువళ్లూరు లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించారు.

● కొత్త చిక్కులు

జిల్లానా... కుమారుడా?

● తేల్చుకోలేకున్న మాజీ మంత్రి


మాజీ మంత్రి జయకుమార్

పెరంబూర్, మార్చి 24: అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ ప్రస్తుతం అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అలాగే, రాయపురం, తిరువికనగర్ నియోజకవర్గాలతో కూడిన ఉత్తర చెన్నై జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఈ రెండు శాసనసభ నియోజకవర్గాలు ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిగా రాయపురం మనో బరిలో ఉన్నారు. ఆయన గెలుపునకు జయకుమార్ ముమ్మరంగా ప్రచారం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో జయకుమార్ కుమారుడు జయవర్ధన్ మూడోసారి దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం నుంచి అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన ప్రత్యర్థిగా డీఎంకే సిట్టింగ్ ఎంపీ తమిళచ్చి తండపాండ్యన్ బరిలో నిలిచారు. దీంతో ఓ వైపు ఉత్తరచెన్నై జిల్లా కార్యదర్శిగా పార్టీ అభ్యర్థి రాయపురం మనో గెలుపుకోసం, మరో వైపు సౌత్ చెన్నైలో తన కుమారుడు జయకుమార్ గెలుపుకోసం తీవ్రంగా పాటుపడాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి.

ఈపీఎస్ లక్కీ నెంబర్ 'ఏడు'


అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి

పెరంబూర్, మార్చి 24: బీజేపీతో చెలిమి వదులుకున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఏడో నంబర్‌ను తన లక్కీగా భావిస్తున్నారు.

- పుదుచ్చేరి సహా 40 లోక్‌సభ నియోజకవర్గాలకు మిత్రపక్షాలకు 7 సీట్లు కేటాయించారు.
- 16 మంది అభ్యర్థులతో తొలిజాబితా విడుదల చేశారు. ఆ రెండు అంకెలు కలిపితే వచ్చే నెంబరు 7.
- అన్నాడీఎంకే మేనిఫెస్టోలోని హామీల సంఖ్య 133. ఆ మూడు నెంబర్లు కలిపితే వచ్చే నెంబరు 7.
- తొలివిడత ఎన్నికల ప్రచారం 7 రోజులపాటు నిర్వహించనున్నారు.
- తొలివిడత ప్రచారంలో ఆయన పాల్గొనే బహిరంగ సభలు 16. ఆ రెండు అంకెలు కలిపితే 7.
- రెండో విడత ప్రచారం 16 రోజులు. ఆ రెండు అంకెలు కలిపితే 7.
- రెండో విడత ప్రచారంలో పళనిస్వామి 34 నియోజకవర్గాల్లో ప్రసంగించనున్నారు. ఆ రెండు అంకెలు కలిపితే 7.


తేనిలో ఆదివారం మధ్యాహ్నం డీఎంకే అభ్యర్థి తంగ తమిళ్‌సెల్వన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

కొబ్బరి బోండాలపై ఓటు హక్కు అవగాహన ప్రచారం


కొబ్బరి బోండాలపై అంటించిన స్టిక్కర్లు

పెరంబూర్, మార్చి 24: లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలవారీగా మారథాన్ పోటీలు, గోడ ప్రకటనలు, వీడియోలు, కళా ప్రదర్శనలు, రంగవల్లికల పోటీలు నిర్వహిస్తోంది. అలాగే, బస్సులు, గ్యాస్ సిలిండర్లు, టీ కప్పులు సహా పలు వస్తువులపై ఓటు హక్కు ప్రాధాన్యం తెలిసేలా స్టిక్కర్లు అతికిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురు తుండడంతో ప్రజలు కొబ్బరి బోండాలు, పుచ్చకాయలతో ఉపశమనం పొందుతున్నారు. ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్న కొబ్బరి బోండాలు, పుచ్చకాయలను అవగాహన ప్రచారానికి వినియోగించాలని కృష్ణగిరి జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు దుకాణాలు, ఫుట్‌పాత్‌లపై విక్రయిస్తున్న కొబ్బరి బోండాలు, పుచ్చకాయలపై ఓటు ప్రాధాన్యత తెలుపుతూ వాటిపై స్టిక్కర్లు అంటించే పనులు చేపట్టింది.

ఆ దర్శకుడి పేరుకు నో చెప్పిన 'ఇళయరాజా'?

ధనుష్ హీరోగా సంగీత మేధావి ఇళయరాజా జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ తెరకెక్కనుంది. 'ఇళయరాజా' పేరుతో రూపొందే ఈ చిత్రానికి అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. ఇటీవల నగరంలో ఈ చిత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. విశ్వనటుడు కమల్ పాల్గొని ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. వచ్చే యేడాది ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే, ఈ చిత్రానికి తొలుత మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించనున్నారనే వార్త కోలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొట్టింది. ఈ విషయం ఇళయరాజా దృష్టికి వెళ్ళడంతో ఆయన నో చెప్పినట్టు వార్తలు వస్తున్నాయి. అలాగే, ఈ చిత్ర దర్శకుల జాబితాలో జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ పేరు కూడా ఉండగా, ఆయన పేరును కూడా ఇళయరాజా రిజెక్ట్ చేశారట. ఆ తర్వాతనే ధనుష్‌తో కెప్టెన్ మిల్లర్ చిత్రాన్ని తెరకెక్కించిన అరుణ్ మాథేశ్వరన్ పేరును డైరెక్టరుగా ఖరారు చేశారు. ఇదిలావుంటే, తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో తెరకెక్కే ఈ చిత్రంలో నటించే నటీనటుల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.


ధనుష్, మారి సెల్వరాజ్

'వాట్ ఈజ్ దిస్ మా లోకేష్'

● నటి గాయత్రి ప్రశ్న ● రొమాన్స్ హీరోగా యాక్షన్ డైరెక్టర్!


'ఇనిమేల్'లో శ్రుతిహాసన్ - లోకేష్

యాక్షన్ డైరెక్టర్ కాస్త రొమాన్స్ హీరోగా మారిపోయారు. ఆయన ఎవరో కాదు.. యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్. హీరోయిన్ శ్రుతిహాసన్‌తో కలిసి 'ఇనిమేల్' అనే ప్రైవేట్ ఇండిపెండెంట్ ఆల్బంలో నటించారు. ఇందులో వీరిద్దరి మధ్య హాట్ హాట్ సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసిన ప్రతి ఒక్కరూ బౌరా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్ ఇపుడు రొమాన్స్ హీరోగా ఎలా మారిపోయారబ్బా అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇదే విషయాన్ని నటి గాయత్రి ప్రస్తావించారు. 'వాట్ ఈజ్ దిస్ మా లోకేష్' అంటూ సరదాగా ప్రశ్నించారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో కమల్ నటించిన 'విక్రమ్' చిత్రంలో గాయత్రి... నటుడు ఫహద్ ఫాజిల్‌ను ప్రేమిస్తుంది. కానీ, చివరకు ఆమె తలను తెగ నరుకుతారు. దీన్ని ప్రస్తావిస్తూ... 'మీ దర్శకత్వంలో వచ్చే సినిమాల్లో ప్రేమిస్తే తల నరికేస్తారు. వాట్ ఈజ్ దిజ్ మా లోకేష్' అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కాగా, ఈ ఆల్బమ్‌ను కమల్ నిర్మించగా లోకేష్ కనకరాజ్‌తో కలిసి నటించిన శ్రుతిహాసన్... స్వయంగా సంగీతం కూడా సమకూర్చారు. గేయ రచన కమలహాసన్ చేశారు. ఈ సాంగ్ టీజర్‌ను తాజాగా రిలీజ్ చేయగా, అందులో శ్రుతిహాసన్ - లోకేష్ కనకరాజ్ మధ్య చిత్రీకరించిన సన్నివేశాలు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ పాటను సోమవారం యూట్యూబ్‌లో రిలీజ్ చేయనున్నారు.



మాట నిలబెట్టుకున్న రాఘవ లారెన్స్

చిత్రజ్యోతి

దివంగత నటుడు, డీఎండీకే అధ్యక్షుడు కెప్టెన్ విజయకాంత్ కుమారుడు, సినీ హీరో షణ్ముగ పాండ్యన్‌కు ఇచ్చిన మాటను హీరో రాఘవ లారెన్స్ నిలబెట్టుకున్నారు. విజయకాంత్ మృతి తర్వాత ఆయన కుటుంబ సభ్యులను లారెన్స్ పరామర్శించారు. ఆ సమయంలో షణ్ముగపాండ్యన్ నటించే చిత్రాలకు తన వంతు సాయం చేస్తానని లారెన్స్ మీడియా ముఖంగా ప్రకటించారు. ఈ మాటను ఆయన నిలబెట్టుకున్నారు. షణ్ముగ పాండ్యన్ హీరోగా 'పడై తలైవన్' పేరుతో ఒక చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ సినిమాలో ఐదు నిమిషాల నిడివి కలిగిన పాత్రలో నటించేందుకు రాఘవ లారెన్స్‌ను చిత్ర బృందం సంప్రదించగా, ఆయన వెంటనే సమ్మతం తెలిపారు. ఈ విషయంపై దర్శకుడు అన్బు మాట్లాడుతూ... "పడై తలైవన్' సినిమాలో 5 నిమిషాల పాత్ర కోసం లారెన్స్‌ను సంప్రదించాం. ఆయన ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా నటించేందుకు అంగీకరించారు. ఇందుకోసం ఆయన ఒక్క పైసా కూడా రెమ్యునరేషన్ తీసుకోలేదు. నలుగురు పేద పిల్లలకు మీవల్ల అయిన సాయం చేస్తే సరిపోతుందని చెప్పారు. ఆయన నటించింది చిన్న పాత్ర అయినప్పటికీ చిత్రానికి ఎంతో బలంగా ఉంటుంది' అని దర్శకుడు వివరించారు.


రాఘవ లారెన్స్, షణ్ముగ పాండ్యన్



స్వయంవరం వేదికపై టీబీఎం అధ్యక్షుడు కల్య రఘుకుమార్, జయరామన్, గోటేటి వెంకటేశ్వరరావు తదితరులు

టీబీఎం నవీన స్వయంవరానికి విశేష స్పందన

ప్యారీస్, మార్చి 24: స్థానిక టీనగర్ బజుల్లా రోడ్డులో ఉన్న శ్రీ రామకృష్ణ మిషన్ పాఠశాల ప్రాంగణంలోని ఇన్ఫోసిస్ హాలులో తమిళనాడు బ్రాహ్మణ మహాసభ (టీబీఎం) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 35వ స్వయంవరానికి విశేష స్పందన వచ్చింది. ఉదయం 8 గంటలకు స్వయంవర పార్వతి పూజ, జపం, సంధ్యా వందనంతో వివాహ నిశ్చయం, వధూవరుల పరిచయ కార్యక్రమం ప్రారంభమైంది. 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వేలూరు, మదురై, కరూర్, తిరుపతి, విజయవాడ, బెంగళూరు ప్రాంతాలకు చెందిన 148 మంది అబ్బాయిలు, 51 మంది అమ్మాయిలు హాజరయ్యారు. వీరి విద్య, జాతకాలు, కుటుంబ వివరాలను ప్రకటించగా, నాలుగు జంటలకు వివాహం కుదిరింది. టీబీఎం అధ్యక్షుడు కల్య రఘుకుమార్ మాట్లాడుతూ... తమ సభ తరపున యేటా నవీన స్వయంవరం నిర్వహించి పెళ్లీడుకొచ్చిన యువతీ యువకులను పరిచయం చేస్తున్నామని, ఈ 35 ఏళ్లలో వేలాదిమంది వివాహం చేసుకొని ఉన్నతస్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన పేద బ్రాహ్మణ కుటుంబాల్లో పెళ్లీడుకొచ్చిన యువతీ యువకులకు ఉచిత వివాహం జరిపించడంతో పాటు ప్రసవం వరకు వైద్య ఖర్చుల నిమిత్తం నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఉన్నత విద్యనభ్యసించి నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, అంతేకాకుండా ప్రతి సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో ర్యాంకులు సాధించే విద్యార్థులను ప్రోత్సహించేలా నగదు బహుమతి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జయరామన్, మ్యారేజ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఇన్‌చార్జి అరక్కోణం బాలు, ఉపాధ్యక్షులు గేటి వెంకటేశ్వరరావు, బాలాజి, కోశాధికారి శంకర్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.